సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 3 । మే । 2023



శ్రీమద్ది అంజన్నకు పూజలు

గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు.



ఎంపీటీసీపై హత్యాయత్నం

పెనుగొండ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ బాలం రామలక్ష్మిపై అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు.

8లో ▸

మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు

కైకలూరు భూ సమేత వేంకటేశ్వరస్వామి మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందారు. నాలుగు శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది.

8లో



న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలులో కొత్త విధానం



ఎల్.అగ్రహారం రైసు మిల్లును పరిశీలిస్తున్న వీరపాండ్యన్

తాడేపల్లిగూడెం రూరల్: రైతులకు ఇబ్బంది లేకుండా నూతన ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండ్యన్ అన్నారు. మంగళవారం మండలంలోని నవాబుపాలెం ఆర్‌బీకే, ఎల్.అగ్రహారంలోని శ్రీనివాస రైసు మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీరపాండ్యన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టి రైస్ మిల్లర్లను సర్వీస్ ప్రొవైడర్‌గా ఉంచిందన్నారు. ఆర్‌బీకేలో ఎఫ్‌టీఓ జనరేట్ చేసిన తర్వాత మిల్లుల వద్ద తూకం, తేమ శాతం లెక్కింపు తిరిగి సమీక్షించడం ఉండదన్నారు. గోనెసంచులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. జాయింట్ కలెక్టర్లకు పూర్తి అధికారాల ఉన్నాయని, వారి ఆదేశాలు తప్పక పాటించాలన్నారు. రైస్ రీ-సైకిల్ చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. రైసు మిల్లుల్లో సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రామసుందరరెడ్డి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎస్.సరోజ, డీఎం టి.శివరామప్రసాద్, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారి ఆర్ఎస్.ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్, తదితరులు

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులలో వృత్తి నైపుణ్యాలు పెంచే విధంగా ప్రభుత్వ కళాశాలలు తీవ్ర కృషి చేయాలని కళాశాలల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ కోరారు. మంగళవారం పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలల నోడల్ రిసోర్స్ సిబ్బందికి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలల వారీగా రివ్యూ నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేలా నూతనంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ముందుకు తీసుకెళ్లాలన్నారు. కళాశాల విద్యాశాఖ రీజనల్ జేడీ డాక్టర్ పీవీ కృష్ణాజీ (రాజమండ్రి), సీసీఈ డీడీ శంకరరావు, అకడమిక్ గైడెన్స్ అధికారి తులసి మస్తానమ్మ, నాక్ ప్రత్యేకాధికారి కె.విజయబాబు,

ట్రైనీ కలెక్టర్ గ్రంథాలయ సందర్శన

బుట్టాయగూడెం : స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. అలాగే గ్రంథాలయ నిర్వహణ, పాఠకుల పరిస్థితిని గ్రంథాలయ శాఖ అధికారి ఎస్.రామలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నపిల్లలకు కథల పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శారాశాంతి తదితరులు పాల్గొన్నారు.

రబీలో కొనుగోళ్ల జోరు

- ఈ ఏడాది భారీగా దిగుబడి
- పశ్చిమలో ఇంతవరకూ 1,97,542 టన్నుల కొనుగోలు
- ఏలూరు జిల్లాలో 84,876 టన్నుల కొనుగోలు
- 21 రోజులకే బిల్లుల చెల్లింపు



ఆకివీడులోని రైస్ మిల్లు వద్ద దిగుమతులకు సిద్ధంగా ఉన్న ధాన్యం



అజ్జమూరు గోడౌన్ వద్ద వేబ్రిడ్జి కోసం క్యూలో ఉన్న ట్రక్కుల్లోని ధాన్యం బస్తాలు

ఆకివీడు: ఈ ఏడాది రబీలో ప్రభుత్వం రైతుకు అండదండగా ఉండడం వల్ల ఆనందం వెల్లివిరుస్తోంది. రబీలో దిగుబడి లక్ష్యాన్ని మించి వచ్చింది. కోతలు ప్రారంభం కాగానే ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాల ద్వారా కొనుగోళ్ల ప్రారంభించింది. దీంతో పంటకు మద్దతు ధర లభిస్తుంది. ఒక పక్క వాతావరణం ఇబ్బంది పెడుతున్నా.. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని, బియ్యం నూక అవుతుందని మిల్లర్లు ఇబ్బందులు పెట్టినప్పటికీ ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించడంతో అన్నదాతకు పూర్తి స్థాయిలో మద్దతు ధర లభిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న కట్టుదిట్టమైన విధానాలతో ధాన్యం ధరలో కోతలు విధించకుండా పూర్తి మద్దతు ధర లభిస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో కమిషన్ ఏజెంట్లు, బ్రోకరేజ్ విధానానికి స్వస్తి చెప్పి ఈ-మార్కెట్ విధానాన్ని గత ఏడాది అమలుజేయడంతో రైతులకు మేలు జరుగుతోంది.

ముమ్మరంగా కొనుగోళ్లు

పశ్చిమ గోదావరి జిల్లాలో రబీ సాగులో 9 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించారు. అయితే లక్ష్యానికి మించి ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రబీలో ఎకరాకూ 55 నుంచి 60 బస్తాల దిగుబడులు వచ్చాయి. సరాసరి దిగుబడి 50 బస్తాలుగా గుర్తించారు. ఈ నెల 12న తాడేపల్లిగూడెం, 15న తణుకు వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ప్రారంభించారు. అనంతరం ఆయా మండలాల్లో కొనుగోలు కేంద్రాల్ని తెరిచారు. ఈ నెల 20 నుంచి జిల్లా స్థాయిలో ముమ్మరంగా కొనుగోళ్లు ప్రారంభించారు.

ముందస్తు కొనుగోళ్ల లక్ష్యం 6.40 లక్షల టన్నులు

పశ్చిమలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ముందస్తుగా 6,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రికార్డు స్థాయిలో 17 రోజుల్లోనే 1,97,542 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. ఇంతవరకూ 21,524 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ. 403 కోట్లు చెల్లించాల్సి ఉండగా 21 రోజులు దాటకుండానే రైతుల ఖాతాల్లో సొమ్ము జమవుతోంది. ఇంతవరకూ రూ.113.55 కోట్ల ధాన్యం సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేశారు.

ఏలూరులో 2 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం

ఏలూరు జిల్లా పరిధిలో రబీ సాగులో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే నిర్ణయించారు. ఇంతవరకూ 84,876 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 7,312 మంది రైతులకు రూ. 173.23 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఐదు రోజుల్లో సొమ్ము జమ



ధాన్యం మిల్లుకు చేరిన ఐదు రోజుల్లోనే సొమ్ము ఖాతాలో జమైంది. పెదకాపవరంలో 1.50 ఎకరాలు సాగు చేస్తున్నాను. రూ.1.28 లక్షలు జమ చేశారు. చాలా సంతోషంగా ఉంది.

– రాయి సూరన్న, పెదకాపవరం, ఆకివీడు మండలం

సాఫీగా సాగుతున్న కొనుగోళ్లు



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయి. రైతులు సంచుల కోసం ఇబ్బంది పడనవసరంలేదు. 2 కోట్లు సంచుల అవసరం ఉంటుందని భావించి, 80 లక్షల సంచులు సమకూర్చాం. అదనపు సేకరణ జరుగుతుంది. ఇప్పటికే రూ.113.55 కోట్ల మేర రైతులకు 17 రోజుల లోపే ధాన్యం బిల్లులు జమయ్యాయి.

– ఎస్.రాంసుందర్ రెడ్డి, జేసీ, పశ్చిమగోదావరి జిల్లా

240 సొసైటీల ద్వారా కొనుగోళ్లు



ధాన్యం కొనుగోళ్ల విధానాన్ని సొసైటీలకు కేటాయించడంతో రైతు సేవల్లో సొసైటీలు నిమగ్నమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 240 సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాం. రబీ సాగులో అధిక మొత్తంలో ధాన్యం కేంద్రాలకు చేరడంతో తమ సొసైటీల సిబ్బంది విస్తృత సేవలందిస్తున్నారు.

– పీవీఎల్.నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

84,876 టన్నుల కొనుగోలు



ఏలూరు జిల్లాలో ముందస్తుగా 2 లక్షల టన్నుల మేర ధాన్యం కొనుగోళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంత వరకూ 84,876 టన్నులు కొనుగోలు చేశారు. 21 రోజులు దాటిన తరువాత రైతులకు సొమ్ము జమయ్యే అవకాశం ఉంది. ఇంతవరకూ 10 రోజుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

– ఆర్.సత్యనారాయణ రాజు, డీఎస్ఓ, ఏలూరు జిల్లా

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి



పాలకొల్లు మండలం దగ్గులూరులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

పాలకొల్లు అర్బన్: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. పాలకొల్లు మండలంలోని దగ్గులూరు, ఆగర్రు రైతు భరోసా కేంద్రాలను మంగళవారం కలెక్టర్ ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల నుంచి ఇంతవరకు సేకరించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, తేమ శాతం చూసే మిషన్, కాటా, స్టాక్ రూం పరిశీలించారు. దగ్గులూరులో 85 మంది రైతుల నుంచి 578 మెట్రిక్ టన్నులు, ఆగర్రులో 91 మంది రైతుల నుంచి 745 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రైస్ మిల్లర్ల నుంచి ఏమైనా సమస్యలు తలెత్తితే విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. నిరుపేదల ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసి లబ్ధిదారులను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. చందపర్రు జగనన్న లే అవుట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. జగనన్న లే అవుట్లలో విద్యుత్, రోడ్లు, మంచినీరు, డ్రైయినేజీ ఇతర మౌలిక వసతుల కల్పనకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పాలకొల్లు పట్టణంలోని కోకోనట్ జూనియర్ కళాశాల, ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు తక్కువ సమయం ఉన్నందున పాత మోడల్ పేపర్లు ఇచ్చి బాగా చదివించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు, హౌసింగ్ డీఈ తదితరులు పాల్గొన్నారు.

ఆగని టీడీపీ నేతల అక్రమ తవ్వకాలు

ఏలూరు రూరల్: కొల్లేరులో టీడీపీ నేతల అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. సోమవారం అటవీశాఖ అధికారులపై దాడి చేసిన అక్రమార్కులు, మంగళవారం సైతం అక్రమ తవ్వకాలకు సిద్ధమయ్యారు. ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక సర్పంచ్, టీడీపీ నాయకుడు ఘంటసాల మహలక్ష్మీరాజు తన అనుయాయులతో కలిసి మంగళవారం రాత్రి అభయారణ్యంలో మరోసారి అక్రమ తవ్వకాలకు సిద్ధమయ్యారు. ఇందుకోసం సాయంత్రం 5 గంటల సమయంలో మాధవాపురం అటవీ చెక్ పోస్టు మీదుగా లారీలపై నాలుగు పొక్లెయిన్లు, బ్లేడ్ ట్రాక్టర్లు తరలించారు. దీన్ని గుర్తించి అధికారులు వాహనాలు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా అభయారణ్యంలో ప్రవేశించరాదని వెనక్కి పంపారు. మరోపక్క అక్రమార్కులపై మంగళవారం అటవీశాఖ రేంజర్ ఎస్వీకె కుమార్ ఏలూరు డీఎస్పీ పైడేశ్వరరావుకు ఫిర్యాదు చేసారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ఉల్లంఘిస్తూ అక్రమ తవ్వకాలు చేపడుతున్నారని వివరించారు. అడ్డుకుంటున్న అధికారులు, సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. అభయారణ్య పరిరక్షణకు సహకరించాలని, అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని కోరారు.



ఏలూరు మండలం మాధవాపురం అటవీ చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్న పొక్లెయిన్

జగన్ చొరవతోనే వంశపారంపర్య హక్కు

తిరుమల శ్రీవారి సన్నిధిగొల్ల కిషోర్‌యాదవ్

గణపవరం: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే తిరుమల సనిధి గొల్లలకు వంశపారంపర్య హక్కులు కలుగచేస్తూ జీవో విడుదల చేసి ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నారని తిరుమల ఏడుకొండలస్వామి సన్నిధిగొల్ల కిషోర్‌యాదవ్ అన్నారు. గణపవరంలో శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన ఆయనను గణపవరం ఇండేన్ గ్యాస్ కార్యాలయంలో స్థానిక ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి తొలి, తుది దర్శనాలను వంశపారంపర్యంగా కలుగచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి ఆచారాన్ని శాశ్వతం చేశారని అన్నారు. కిశోర్ యాదవ్ దంపతులను గజమాలతో, పూలకిరీటంతో సత్కరించి, జ్ఞాపిక అందచేశారు.



సన్నిధిగొల్ల కిషోర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సూర్య, చంద్ర ప్రభలపై దేవదేవుడు

శ్రీరామ శివ ధనుర్భంగం అలంకారంలో శ్రీవారి దర్శనం

ద్వారకాతిరుమల: సూర్య, చంద్ర ప్రభలపై మెరిసిన ఆ దేవదేవుడిని కనులారా వీక్షించిన భక్తజనులు పులకించారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో జరుగుతున్న శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా పంచాయుధాలను ధరించి, నారాయణమూర్తి అలంకరణలో సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించిన శ్రీవారికి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి, హారతులిచ్చారు. అనంతరం శంఖు, చక్రం, గద, పద్మం, ధనుస్సు చేతపట్టుకుని సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామివారికి ఉదయం కోవెల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ అలంకారంలో ఉన్న స్వామివారిని దర్శించిన భక్తులకు సూర్యదేవుని అనుగ్రహంతో సకల విద్యా, ఆరోగ్య, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. రాత్రి ఉభయ దేవేరులతో చినవెంకన్న చంద్రప్రభ వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవలు, చిరుగాలుల నడుమ చల్లనయ్య విశేష పుష్పలంకరణలో భక్తలోకానికి దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై బాలికలు బొండాడ మనస్విని, నరం లాస్యశ్రీ, నల్ల చాతుర్యలు ప్రదర్శించిన కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు చూపరులను అలరించాయి. ఆలయ ముఖ మండపంలో శ్రీరామ శివ ధనుర్భంగం అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు :

- ఉదయం 7 గంటల నుంచి – హనుమద్వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- ఉదయం 8 గంటల నుంచి – భజన కార్యక్రమాలు
- ఉదయం 10 గంటల నుంచి – భక్తిరంజని
- సాయంత్రం 4 గంటల నుంచి – భరతనాట్య ప్రదర్శనలు
- సాయంత్రం 6 గంటల నుంచి – ప్రవచనాలు
- రాత్రి 7 గంటల నుంచి – ఎదుర్కోలు ఉత్సవం
- రాత్రి 7 గంటల నుంచి – భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 8.30 గంటల నుంచి – వెండి శేషవాహనంపై తిరువీధి సేవ
- ప్రత్యేక అలంకరణ : సత్యభామ శ్రీకృష్ణులు



సూర్యప్రభ వాహనంపై శ్రీవారికి కోవెల ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది



శ్రీరామ శివ ధనుర్భంగం అలంకారంలో ఉన్న శ్రీవారు

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు 15 వరకు గడువు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా ప్రవేశానికి ఈ నెల 15 వరకూ గడువు ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం సీట్లు, ఎస్టీలకు 4 శాతం సీట్లు, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. రెండో విడతలో భాగంగా ఈ నెల 6 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని చెప్పారు.

12న ఉద్యాన వర్సిటీకి గవర్నర్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవం ఈ నెల 12న నిర్వహించడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. స్నాతకోత్సవానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి మినిట్ టు మినిట్ ప్రోగ్రాం త్వరలో విడుదల చేయనున్నారు. కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందచేస్తారు.

● కారుమబ్బులు కమ్ముతుంటే..



గత రెండ్రోజులుగా ఆకాశంలో కారుమబ్బులు కమ్మి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం ఆకాశంలో మేఘాలు దట్టంగా అలుముకుని కనువిందు చేశాయి. ఏలూరు దక్షిణపువీధిలో కనిపించిన అందమైన దృశ్యమిది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

వృద్ధులకు వరం.. కంటి వెలుగు

- జిల్లాలో మూడో విడత పరీక్షలు
- ఇంతవరకు 22,718 మందికి స్క్రీనింగ్
- 3815 మంది ఆపరేషన్లకు సిఫార్సు

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధుల కోసం కంటి వెలుగు పథకం ప్రవేశ పెట్టి వారికి చూపునిస్తున్నారు. 60 ఏళ్ల దాటిన వృద్ధులకు విడతల వారీగా ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు ఇవ్వడంతో పాటు ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. మూడో విడత స్క్రీనింగ్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మూడో విడత పరీక్షలు ప్రారంభించి ముమ్మరంగా చేస్తున్నారు.

వృద్ధులకు వరం

60 ఏళ్ల దాటి కంటి చూపు సరిగా లేక ఇబ్బందులు పడే వారి కష్టం తెలిసిన ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డి కంటి వెలుగు పథకం అమలు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వృద్ధులు కంటి చూపు సమస్యలతో బాధపడుతూ ఆపరేషన్లు, వైద్యానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉచితంగా మందులు, కళ్ల అద్దాలు ఇస్తున్నారు. ఆపరేషన్లు చేయిస్తూ వారి కళ్లల్లో ఆనందాన్ని నింపుతున్నారు. ఈ పథకం పట్ల వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూడో విడతలో 22,718 మందికి పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా 10 బృందాలు పనిచేస్తున్నాయి. వీటిలో కంటి వైద్యులు, నర్సు, ఏఎన్ఎం, ఆశలు ఉంటారు. ఆయా సచివాలయానికి వెళ్లి కంటి పరీక్షలు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 88,638 మందికి మూడో విడత కంటి పరీక్షలు చేయాల్సి ఉండగా ఇంతవరకు 22,718 మందికి నిర్వహించారు. వారిలో 18,727 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందచేశారు. 3,815 మందికి కళ్లద్దాలు అందించారు. 174 మందికి ఆపరేషన్లు పడతాయని గుర్తించి చర్యలు తీసుకున్నారు.



తాడేపల్లి గూడెం మండలం కృష్ణయ్య పాలెంలో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉచితంగా ఆపరేషన్లు



జిల్లా వ్యాప్తంగా 3వ విడత కంటి వెలుగు కార్యక్రమం జరుగుతుంది. జిల్లాలో 10 టీంలు ఈ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 60 ఏళ్ల దాటిన వృద్ధులకు స్క్రీనింగ్ పరీక్షలు అందిస్తున్నారు. ఇంతవరకూ 22,718 మందికి పరీక్షలు పూర్తి చేసి మందులు, కళ్ల జోళ్లు, ఆపరేషన్ అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లకు సిఫార్సు చేశాం. ఆయా సచివాలయాల్లో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని వృద్ధులు ఉపయోగించుకోవాలి.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

తొలి రెండు విడతల్లో 88,638 మందికి వైద్య సేవలు

కంటి వెలుగు పథకం ప్రవేశపెట్టిన తర్వాత తొలి రెండు విడతల్లో 88,638 వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మందులు పొందిన వారు 47,542 మంది కాగా కళ్లజోళ్లకు సిఫార్సు పొందిన వారు 37,961 మంది. కళ్ల జోడు అందుకున్న వారు 34,144 మంది. 3,135 మందికి కంటి ఆపరేషన్లు చేశారు.

ఎంపీటీసీ రామలక్ష్మి దంపతులపై హత్యాయత్నం

- కత్తులతో దాడిచేసిన ఇద్దరి వ్యక్తులు
- ఆస్తి తగాదాలే కారణమని అనుమానం

పెనుగొండ: పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు బాలం రామలక్ష్మి, ఆమె భర్త పెద్దిరాజుపై సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. ఆస్తి తగాదాల నేపథ్యంలో బంధువులే ఈ ఘాతుకానికి ఒడిగట్టారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రామలక్ష్మి కుటుంబ అవసరాల నిమిత్తం మూడు రోజులుగా సోమరాజు చెరువులోని సోదరి దంపనబోయిన లక్ష్మి ఇంటికి వెళుతున్నారు. సోమవారం రాత్రి రామలక్ష్మి దంపతులు సోమరాజు చెరువు వెళ్లారు. తిరిగి పెనుగొండ వెళుతుండగా సోమరాజు చెరువు సమీపంలోని మునమర్రు గోశాల వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారిపై దాడిచేసి కొట్టారు. చాకుతో ఇద్దరినీ తీవ్రంగా గాయపరిచారు. అదే సమయంలో పెనుగొండ వైపు నుంచి వాహనం వస్తుండడంతో దుండగులు పరారయ్యారు. తమపై దాడిచేసింది బంధువులైన వీరవల్లి శ్రీను, వీరవల్లి అంతర్వేది అని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామలక్ష్మి కుటుంబానికి, ఆమె మేనత్త వీరవల్లి సుబ్బమ్మ కుటుంబ సభ్యులతో ఉన్న ఆస్తి తగాదాలే ఈ హత్యాయత్నానికి ప్రధాన కారణమని అనుమానిస్తున్నారు. 17 కుంచాల పొలం, 250 గజాల స్థలంపై ఇరువర్గాల వారు కొంతకాలంగా కోర్టులో పోరాడుతున్నారు. దిగువ న్యాయస్థానం నుంచి ఇటీవల హైకోర్టుకు వెళ్లారు.

రాజకీయ నేపథ్యం లేకపోయినా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రాముఖ్యత ఇస్తున్న నేపథ్యంలో పెనుగొండ-2 ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్‌సీపీ రామలక్ష్మిని పోటీకి నిలపగా, ఆమె విజయం సాధించారు. ఆమె భర్త పెద్దిరాజు సాగుతో పాటు పాడి పోషణ చేసుకొంటూ జీవనం సాగిస్తుండగా, ఎంపీటీసీ రామలక్ష్మి ఇంటి వద్దే చీరలు, గాజుల వ్యాపారం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నారు.

ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు పరామర్శ

హత్యాయత్నానికి గురై తీవ్ర గాయాలతో తణుకు ప్రభుత్వాసుపత్రిలో చేరిన ఎంపీటీసీ రామలక్ష్మిని ఆచంట ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరకువాడ శ్రీరంగనాథరాజు ఆసుపత్రికి హుటాహుటిన చేరుకొని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పెనుగొండ, పెనుమంట్ర ఎంపీపీ సభ్యులు పుతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), కేవీఎస్ నారాయణరెడ్డి (వాసు), వైఎస్సార్ సేవాదళ్ మండల కన్వీనరు బాలం సత్తిరాజు, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్‌లు తణుకు ప్రభుత్వాసుపత్రిలో బాధితులను పరామర్శించారు. పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్‌లు ఘటన స్థలాన్ని పరిశీలించడంతో పాటు, తణుకు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ఎంపీటీసీ రామలక్ష్మి నుంచి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


రామలక్ష్మి భర్త పెద్దిరాజు చేతిపై గాయం


ఎంపీటీసీ రామలక్ష్మి పొట్టపై కత్తి గాయం


108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం


తణుకులో రామలక్ష్మిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


రామలక్ష్మి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


పాదలాడలో జరిగిన ప్రమాద స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇరగవరం: వేగంగా వస్తోన్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ట్రక్కు వెనుక చక్రాల కింద పడి మహిళ దుర్మరణం పాలైన ఘటన ఇరగవరం మండలం పాదలాడలోని కత్తిపాడు రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నత్తారామేశ్వరం గ్రామానికి చెందిన నమ్మితి బేబి (54) వివాహం కాలేదు. దీంతో ఆమె తన తమ్ముడు నమ్మితి అన్నవరం వద్ద ఉంటోంది. మంగళవారం ఉదయం తన మేనకోడలు నమ్మితి అమూల్యతో కలిసి బైక్‌పై పెనుగొండ వెళుతుండగా మార్గం మధ్యలో పాదలాడ - కత్తవపాడు రోడ్డు వద్ద ఎదురుగా అతి వేగంగా వస్తోన్న ట్రాక్టర్‌ను తప్పించబోయి పడిపోయారు. బేబి ట్రాక్టర్ ట్రక్కు వెనకాల చక్రాల క్రింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అమూల్య మరోవైపు పడడంతో గాయాలతో బయటపడింది. సమాచారం అందుకున్న తణుకు సీఐ సీహెచ్ ఆంజనేయులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బేబి చెల్లెలు కొడుకు దిడ్ల నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అడబాల రాజుకు అవార్డు


అవార్డు అందుకుంటున్న అడబాల రాజు

వీరవాసరం: 'చూడ చక్కని చిత్రం' తెలుగు లఘు చిత్రానికి దాసరి ఫిల్మ్ అవార్డు లభించింది. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన దాసరి ఫిల్మ్ అవార్డు ఫంక్షన్‌లో వీరవాసరం మండలం రాయకుదురు గ్రామానికి చెందిన లఘు చిత్రాల దర్శకుడు, శ్రీ కృష్ణ దేవరాయ నాటక కళ పరిషత్ ప్రధాన కార్యదర్శి అడబాల లక్ష్మీనారాయణ (రాజు) అవార్డు అందుకున్నారు. అడబాల రామకృష్ణుడు నిర్మాతగా పద్మజ నారాయణ సహ నిర్మాతగా చూడ చక్కని చిత్రం నిర్మించామని మంగళవారం తెలిపారు. 100కు పైగా చిత్రలకు డైరెక్టర్‌గా పనిచేసి లెజెండ్‌గా పేరు పొందిన దివంగత దాసరి నారాయణరావు పేరు మీద సినీ డైరెక్టర్ వీవీ వినాయక్, సినీ నటులు అలీ, శ్రీకాంత్, సినీ నిర్మాతలు తమ్మారెడ్డి భరద్వాజ, సి. కల్యాణ్, రేలంగి నర్సింహరావు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ సమక్షంలో అవార్డు స్వీకరించడం ఆనందంగా ఉందని అన్నారు. గతంలో పాలకొల్లులో జరిగిన క్షీరపురి షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌లో చిరునవ్వుల్లో షార్ట్ ఫిల్మ్ ఉత్తమ ఫిల్మ్‌గా ఎంపికయిందని, రాయకుదురుపై రాసిన చరిత్రలో మా ఊరు బుక్ 2012లో ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి ఆవిష్కరించారని గుర్తు చేశారు. రాజును సర్పంచ్ గెడ్డం భారతి, శ్రీకృష్ణదేవరాయ నాటక పరిషత్ అధ్యక్షుడు గోపాలకృష్ణ, అడబాల బాబి, తోట బుజ్జి తదితరులు అభినందించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.3.55 లక్షల టోకరా

జంగారెడ్డిగూడెం: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ఓ యువకుడు వద్ద నుంచి నగదు కాజేసిన ఘటన జంగారెడ్డిగూడెంలో వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన యువకుడికి ఏప్రిల్ 2న పార్ట్‌టైం ఉద్యోగం పేరిట ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌ను కాంటాక్ట్ చేయగా, ఓ టెలిగ్రామ్ గ్రూపును యువకుడికి పంపి అందులో మెంబర్‌గా చేర్చారు. గూగుల్ మ్యాప్‌లో హోటళ్లు, కంపెనీలకు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని చెప్పి చాటింగ్ ద్వారా నమ్మబలికారు. యోసిస్ ట్రేడింగ్ కంపెనీ ద్వారా ఎంటీఎక్స్ కాయిన్ యాప్‌లో నగదు పెడితే, దానికి రెట్టింపు ఇస్తామని చెప్పి నమ్మించారు. దీంతో యువకుడు రూ. 40 వేలు వారు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. అనంతరం రెట్టింపు సొమ్ము కావాలంటే మరికొంత నగదు జమ చేయాలని మెసేజ్ రావడంతో, ఇలా దఫదఫాలుగా ఆ యువకుడు రూ.3.55 లక్షలు వివిధ అకౌంట్‌లకు బదిలీ చేశాడు. అనంతరం మెసేజ్ వచ్చిన టెలిగ్రామ్ గ్రూపును సదరు కంపెనీ క్లోజ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన యువకుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు యువకుడు పంపించిన అకౌంట్‌లను పరిశీలించి ఒక అకౌంట్‌లో ఉన్న రూ.99 వేలను సీజ్ చేశారు. మంగళవారం యువకుడు జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు.

పెరుగ్గూడెంలో చోరీ

దెందులూరు: పెరుగ్గూడెం గ్రామంలో యలమర్తి రమేష్‌కు చెందిన ఇంట్లో 25 కాసుల బంగారం మంగళవారం చోరీకి గురైంది. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు రాత్రి క్లూస్ టీం సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు


శృంగవృక్షంలో బస్సులో చెలరేగిన మంటలు

పాలకోడేరు: భీమవరం ఆర్టీసీ డిపో నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంగళవారం ఉదయం మంటలు చెలరేగాయి. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామం వచ్చేసరికి బస్సులో మంటలు రావడాన్ని ఆటో, వాహనచోదకులు గమనించారు. విషయం డ్రైవర్‌కు తెలియజేయడంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును అక్కడే నిలిపివేశారు. ప్రయాణికులు బస్సు నుంచి దిగిపోయారు. స్థానికులు మంటలను అదుపు చేశారు. సమాచారం అందుకున్న భీమవరం ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు. నష్టం రూ.2 లక్షలు ఉంటుందని అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు తెలిపారు.

మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- గురువారం స్వామివారి దివ్యకల్యాణం
- తెలుగు రాష్ట్రాల్లో ఏకైక మీసాల ఆలయం ఇది

కై కలూరు: నల్లటి ముఖ వర్చస్సు.. తెల్లటి తిరునామాలు.. కటి, అభయ హస్తలు.. కంఠాభరణాలు.. చిద్విలాసం ఇవి సప్తగిరీశుని తలవగానే గుర్చుకొచ్చే ఉహారూపం. మీసం రాజసానికి చిహ్నం. అటువంటి మీసాలు కై కలూరు వెంకన్న స్వామికి ఉండటం విశేషం. బొడ్డులో కత్తి ఉండటం మరో వింత. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి తిరుమలేశుని ప్రతిమను ఎక్కడా చూడం. నాలుగు శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయం వార్షిక బ్రహోత్సవాలకు సిద్ధమైంది. దేవదాయ శాఖ ఇటీవల రూ.కోటి విరాళంతో ఆలయాన్ని పునఃనిర్మించింది.

నాలుగు శతాబ్దాల చరిత్ర

కైకలూరు భూ సమేత వేంకటేశ్వరస్వామి మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందారు. పూర్వం కైకలూరు గ్రామాన్ని కైంకర్యపురిగా పిలిచేవారు. ఆలయం వద్ద తవ్వకాల్లో బయటపడిన శిలాశాసనం ఆధారంగా క్రీస్తుశకం 1628లో శాలివాహన కాలం నుంచి ఆలయం ఉందని తెలుస్తోంది. సాక్షత్తూ దేవతలే ఈ ఆలయాన్ని నిర్మించినట్టు శాసనంలో పేర్కొన్నారు. అనంతరం ఆత్రేయగోత్ర సంభూతుడు ఖండేరాయుడు అనే దాత ఆలయాభివృద్ధికి కృషి చేశారు. ఈ ఆలయానికి అంతర్వేది, కలిదిండి, శ్రీకాకుళం, శోభనాచలం, ఏలూరు, కోరుకొండ క్షేత్రాలను హద్దులుగా నిర్ణయించారు. కైకలూరులో భవానమ్మ చెరువు (ప్రస్తత పంచాయతీ తాగునీటి చెరువు) నీటిని స్వామివారి అభిషేకాలకు వినియోగించాలని శాసనంలో లిఖించి ఉంది. స్వామివారికి ప్రతి ఏటా నిత్యోత్సవం, మాసోత్సవం, పక్షోత్సవం, వర్షోత్సవాలను నిర్వహిస్తున్నారు.

వైభవంగా దివ్యకల్యాణం

మీసాల వెంకన్న ఆలయంలో మే 3 నుంచి 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడో తేదీన స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించనున్నారు. మాడ వీధుల్లో గజ వాహనంపై స్వామి ఊరేగనున్నారు. సాయంత్రం నిర్వహించే గరుడ ముద్దల కార్యక్రమానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు హాజరవుతారు. 4వ తేదీ రాత్రి 7 గంటలకు స్వామివారి దివ్వ కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం శేషవాహనంపై స్వామి ఊరేగుతారు. చివరి రోజు శుక్రవారం స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు.


కైకలూరులో మీసాల వెంకన్న


కైకలూరులో మీసాల వెంకన్న స్వామి ఆలయం

మహిమోన్నోతుడు



పూరాతన మీసాల వెంకన్న దర్శనం శుభాలను కలిగిస్తోంది. గురువారం రాత్రి అందించే గరుడ ముద్దలను స్వీకరిస్తే సంతానం కలుగుతోందని ప్రతీతి. ఆలయం వద్ద మూడు రోజులు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. ఆలయాన్ని పునఃనిర్మాణానికి దేవదాయశాఖ, భక్తుల విరాళాలతో రూ.కోటి నిధులు వెచ్చింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

– వీఎన్‌కే శేఖర్, ఆలయ ఈఓ, కైకలూరు

● ఇంటింటా సంక్షేమం


ఉండి: ఉండి మండలం కలిగొట్లలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

గంజాయి కేసులో నిందితులకు రిమాండ్

సాక్షి, భీమవరం: భీమవరంలో గంజాయి విక్రయిస్తోన్న 11 మందిని స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద సోమవారం అరెస్టు చేసి వారి నుంచి 17 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను మంగళవారం తెలిపారు. వీరిలో ఇద్దరు బాలురు ఉన్నట్టు చెప్పారు. మిగిలిన తొమ్మిది మందిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, బాలురును జువైనల్ కోర్టులో హాజరుపర్చినట్టు సీఐ శ్రీను తెలిపారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- ముగ్గురు అరెస్టు
- రూ.10 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- జిల్లా ఎస్పీ రవిప్రకాష్

తణుకు: తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతోన్న ముగ్గుర్ని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు అన్నదమ్ములు ఉండటం విశేషం. వీరు గత రెండేళ్లుగా తణుకు రూరల్, టౌన్, ఇరగవరం పోలీసు స్టేషన్ల పరిధిలో ఏడు చోరీలకు పాల్పడ్డారు. నిందితుల వివరాలను తణుకు రూరల్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ విలేకర్లకు వెల్లడించారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామానికి చెందిన ప్రస్తుతం పాలంగిలో నివాసం ఉంటున్న పాలాడి భానుప్రకాష్, తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు తణుకు వెంకటేష్ అలియాస్ వెంకీ, తణుకు సాయిబాబా అలియాస్ సాయిలు స్నేహితులు. వెంకటేష్ సెల్‌ఫోన్ రిపేర్లు చేస్తుంటాడు. గతంలో పీఈటీగా పని చేసిన సాయిబాబాతో కలిసి భానుప్రకాష్, వెంకటేష్‌లు వ్యసనాలకు అలవాటు పడ్డారు. చోరీలకు అలవాటు పడ్డారు. రెండేళ్లుగా పగలు తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రెక్కీ నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో స్క్రూడ్రైవర్, హెక్సాబ్లేడుతో తాళాలు కోసం చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ఘటనల్లో వచ్చిన ఫిర్యాదుల మేరకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎస్సై కె.గుర్రయ్య కేసులు దర్యాప్తు చేపట్టారు. భానుప్రకాష్, వెంకటేష్, సాయిబాబాలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.10 లక్షల విలువైన 155 గ్రాముల బంగారు ఆభరణాలు, 1770 గ్రాముల వెండి ఆభరణాలు, బుల్లెట్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ కేసులో సహకరించిన సీఐ ఆంజనేయులు, ఎస్సై గుర్రయ్య, హెడ్ కానిస్టేబుల్ కేవీ సుబ్బారావు, కానిస్టేబుళ్లు ఎస్‌కే అక్బర్, ఎస్‌కే అన్వర్, జె.అరుణ్‌కుమార్, ఎస్ఆర్ కృష్ణంరాజు, వి.మాధవరావు, ఎస్.అప్పారావులను ఎస్పీ రవిప్రకాష్ అభినందించారు. వీరికి నగదు రివార్డులను అందజేశారు.


తణుకులో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

క్లుప్తంగా

బుద్దాల వెంకట రామారావుకు దాసరి ఫిల్మ్ అవార్డు



దాసరి ఫిల్మ్ అవార్డు అందుకుంటున్న బుద్దాల వెంకట రామారావు దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ నందు దాసరి ఫిల్మ్ అవార్డు అందుకున్నారు. దాసరి అవార్డు అందుకున్న సందర్భంగా పట్టణ ప్రముఖులు, కళాకారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మరన్ని గౌరవాలు అందుకోవాలన్నారు.

మిషన్-50ని విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, సభ్యులు

తాడేపల్లిగూడెం అర్బన్: మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మిషన్-50ని విజయవంతం చేసే కార్యక్రమాలు చేపడుతున్నామని దూలప్లి శ్రీను మాదిగ తెలిపారు. మంగళవారం స్థానిక 31వార్డులో ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన అధ్యక్షుడిగా లంకా రాజశేఖర్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లంకా మోహన్‌బాబు, శీలి వెంకటేశ్వరరావు, శీలి వెంకటాచలం, శీలి సుబ్బారావు, శీలి మోషే, శీలి బాలకృష్ణ, గాలింకి ప్రేమ్‌కుమార్ మాదిగ, గడ్డం సాయి మాదిగ, శీలి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

గూడెంలో 10.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 10.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వైఏపీ.అప్పారావు మంగళవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 9.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడల్లో శిక్షణ

సాక్షి, భీమవరం : పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెలాఖరు వరకు వివిధ క్రీడల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, పీడీ ఎం.శివ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సహకారంతో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆర్చరీ, ఫెన్సింగ్, తైక్వాండ్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 72075 27443 నంబర్‌లో లేదా కళాశాలలోగాని సంప్రదించాలని కోరారు.

4న పెద అమిరంలో జాబ్ డ్రైవ్

సాక్షి, భీమవరం : కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలో ఈనెల 4వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరియర్ సర్వీస్ సహకారంతో జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పి.మధుభూషణంరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్కార్ట్ కంపెనీలో డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం జాబ్ డ్రైవ్ జరుగుతోందని, టెన్త్ అపై విద్యార్హత కలిగిన యువతీ, యువకులు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 93935 75353 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

పాలకోడేరు: మద్యం మత్తులో బైక్ నడుపుతూ, ఎదురుగా మరో బైక్ పై వస్తున్న కానిస్టేబుల్‌ను ఢీ కొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాల ప్రకారం పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న బాలకృష్ణ అనే కానిస్టేబుల్ మంగళవారం మధ్యాహ్నం భోజనానికి స్వగ్రామం ఆరవల్లి బైక్ పై వెళ్తుండగా, ఎదురుగా బైక్ పై వస్తున్న బొబ్బనపల్లి సునీల్ ఢీ కొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో వారిద్దరినీ భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఢీ కొన్న యువకుడు వెంప గ్రామానికి చెందిన వాడని, మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని వివరించారు.

వాలీబాల్ అకాడమీ ఏర్పాటు

కాళ్ల: వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు వాలీబాల్ అకాడమీ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్ రాజు తెలిపారు. ఈ మేరకు కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివాజీ వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోపల్లె గ్రామానికి చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు శివాజి రాజు పేరు మీద అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో గ్రామాల వారిగా యువతకు వాలీబాల్ కిట్లను అందజేసి క్రీడాభివృద్ధికి అకాడమీ కృషి చేస్తుందని వక్తలు తెలిపారు.

వాన జోరు.. అన్నదాత బేజారు



కొండేపాడు గ్రామంలో వర్షానికి తడిచిన పంటను పరిశీలిస్తున్న రైతు



కోరిమిల్లి గ్రామంలో రైసుమిల్లు సమీపంలో తడవకుండా ధాన్యం రాసులపై కప్పి ఉంచిన బరకాలపై వర్షం నీరు

- అకాల వర్షంతో రైతుల ఇక్కట్లు
- వరి పంట ఒబ్బిడిలో నిమగ్నమైన రైతన్నలు

పెంటపాడు: మండువేసవిలో వాతావరణం ఉన్నట్టుండి చల్లబడి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీస్తూ అకాలవర్షం కురుస్తుండటంతో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకొనేందుకు తీవ్ర అగచాట్లు పడాల్సి వస్తోంది. సోమవారం పలు మండలంలో పలు ప్రాంతాల్లో తీవ్ర వర్షం కురిసింది. సోమవారం అనుకోకుండా వేకువజామున ఉన్నట్టుండి వర్షం ఒక్కసారిగా కురవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ముమ్మరంగా వరికోతలు చేపట్టడంతో ధాన్యం ఎక్కడ తడిచిపోతుందోనని రైతులు హడావుడిగా పంటను కాపాడుకోవడానికి బరకాలు కప్పి ఉంచే పనుల్లో నిమగ్నమయ్యారు. పలు చోట్ల యంత్రాలతో కోసిన ధాన్యం తెచ్చుకొనేందుకు ఇబ్బందులు పడ్డారు. అంతకుముందు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం పోగుచేసుకొనే పనిలో పడ్డారు. ధాన్యం నెట్లు వాహనాల ద్వారా తరలించడంతో ప్రమాదం తప్పింది. పెంటపాడు మండలంలో సుమారు 60 శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. మిగతా 40 శాతం వరి వర్షం వల్ల చేలపై పాక్షికంగా పడటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తడిచిన ధాన్యం మొలకెత్తి, రంగు మారకుండా ఉండేందుకు కిలో కళ్లు ఉప్పును 10 కిలోల ఊకతో కలిపిన మిశ్రమాన్ని ధాన్యానికి పొరలుగా పోసి కలపాలన్నారు. నేలకొరిగిన వరిపైరుపై చేలలో నీరు తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఒక లీటరు నీటికి 20 గ్రాముల కళ్లు ఉప్పును కలిపి చేలలో పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

వరి పనలపై ఉప్పుద్రావణం చల్లాలి



కూలీలతో పంట కోసిన రీతిలో వరిపనలు వర్షానికి తడిస్తే వాటిపై ఉప్పుద్రావణాన్ని చల్లాలి. గింజ మొలకెత్తకుండా పంటను రక్షించుకోవాలి. పలు గ్రామాల్లో యంత్రాలతో కోతలు ప్రారంభిస్తే వాతావరణం దృష్ట్యా రెండు రోజులు కోతలు నిలుపుదల చేయాలి. ఇప్పటి వరకు కోసిన చేలలో వరి గడ్డిని పశుగ్రాసం కోసం నిల్వచేసుకోవాలి. చేలలో నీరు లేకుండా బోదెల ద్వారా వర్షం నీటిని పల్లపు ప్రాంతాలకు తరలించాలి. ధాన్యం రాసులపై బరకాలు కప్పి ఉంచి వర్షం నీరు అందులోకి చేరకుండా చూసుకోవాలి.

– కె. పార్థసారథి, మండల వ్యవసాయాధికారి పెంటపాడు

రైతును ముంచిన అకాల వర్షం:
గత రాత్రి నుంచి కురిసిన అకాల వర్షానికి రైతు కుదేలయ్యాడు. ఆదివారం రాత్రినుంచి సోమవారం ఉదయం వరకు సుమారు 48మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వ్యవసాయ రైతులతోపాటు ఉద్యానరైతులు కూడా నష్టపోయారు. మంగళవారం కూడా అక్కడక్కడా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలలోకి నీరు చేరింది. వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

రైతులు అధైర్యపడవద్దు



అత్తిలిలో తడిసిన ధాన్యాన్ని ఎండబెడుతున్న రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అత్తిలి: రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. రాష్ట్రపౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదేశానుసారం అత్తిలి మండలంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో వరికోతలకు మరో రెండు రోజుల పాటు వేచి చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, కంకటాల సతీష్, కముజు శ్రీనివాస్, చిటకన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్, తణుకు పట్టణ అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సమగ్ర సర్వే యాత్ర మంగళవారం తణుకు చేరింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరిరావు, కోశాధికారి శ్రీధర్ రవిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అంబళ్ల శ్రీనివాస్, ఉప కోశాధికారి కింతాడ కృష్ణమోహన్‌లు తణుకు ఎలక్ట్రికల్ అసోసియేషన్‌ను కలిసి సమగ్ర సర్వే ముఖ్య ఉద్దేశాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి తెలియచేయాల్సిన తమ న్యాయమైన డిమాండ్‌లపై చర్చించారు. అనంతరం వర్కర్స్ అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తణుకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేతా విజయకుమార్, బళ్ల నాని, సభ్యులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి



ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న అధికారులు

ఇరగవరం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో పి శ్రీనివాసరావు అధ్యక్షతన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు గ్రామాస్థాయిలోని అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను త్వరిత గతిని పూర్తి చేయాలన్నారు. ఆయుష్మన్ భారత్, ఇ సేవాలు , మిషన్ వాత్సల్య, కల్యాణమస్తు, జగనన్న కాలనీలు , వలంటీర్ల హజరు మొదలైన వాటిపై రివ్యూ నిర్వహించారు. ఈ నెలలో మూహుర్తాలు ఎక్కువగా ఉన్నందున ఇళ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వై ముని రాజు, సీనియర్ అసిస్టెంటు మూర్తి, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాపులపై పెట్టిన కేసులు ఎత్తివేయడంపై హర్షం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తుని ఘటనకు సంబంధించి కాపులపై పెట్టిన కేసులు ఎత్తి వేయడంపై మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ గతంలో అమాలపురంలోను, గరగపర్రులోను ఎస్సీలపై పెట్టిన కేసులు కూడా ఉన్నాయని, అవి కూడా ఎత్తివేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఎస్సీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కేంద్రం సైతం ఎస్సీలకు ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్రంగా ఏపీని ప్రకటించిందని కొనియాడారు. ఈ సమావేశంలో జీఏ బాబు, ఎలీషా, కె.రాజారావు, బి.సందీప్, సునీల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవేశాలను పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి రామాంజనేయరాజు

తాడేపల్లిగూడెం అర్బన్ : పాఠశాలల్లో చేరని విద్యార్థులను ప్రవేశాలు చేయించేలా చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ అధికారి బి రామాంజనేయరాజు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు ప్రవేశాలు చేయించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల సమావేశం అనంతరం ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కరిబండి రామకృష్ణ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చునని తెలిపారు. యోగా అభ్యసనపై మెళుకువలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు, పరిమెళ్ల గ్రామాల బాలుర, బాలికల వసతిగృహాల ఇన్‌చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయ బాబూరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బంగారుగూడెం, వీరంపాలెం, పట్టింపాలెం గ్రామాల్లో ధాన్యం రాశులను, మొక్కజొన్న రాశులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన వరి రైతులకు ఎకరానికి రూ.20వేలు ఇవ్వాలన్నారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. మొక్కజొన్నకు క్వింటాకు రూ.2200లు ధర ఉండగా, ప్రస్తుతం రూ.1700లు ఇస్తామంటున్నారని, రైతులు పెట్టు బడి కూడా రావడం లేదని ఆందోళన చెందుతున్నార న్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి పాలుపూరి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తల్లిబోయిన శ్రీను,జాస్తి వెంకట్రావు, సత్యనారాయణ, మేకా సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



దువ్వ సొసైటీ వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

తణుకు టౌన్: రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ, సహకారాలు అందుతున్నాయని తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. మంగళవారం దువ్వ సొసైటీ వద్ద సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమావేశంలో రైతులు నల్లా శ్రీను, గూడుపు దుర్గా నాగేశ్వరరావు, బాదనాల కిషోర్, తదితర రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ ద్వారా ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాళ్లకు రూ. 1530 అందుతుందన్నారు. రైతులు దళారులను నమ్మవద్దని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు అప్రమత్తమై రైతులకు సొమ్ముల చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా చూస్తున్నారని వివరించారు.

రెజ్లర్ల ఆందోళనకు ఎస్‌ఎఫ్‌ఐ మద్దతు



భీమవరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : మహిళా రెజ్లర్ల క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీకి చెందిన ఎంపీ బ్రిజు భూషణ్‌సింగ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భీమవరంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ రెజ్లింగ్ క్రీడలో ఒలింపిక్ మెడల్స్ సంపాదించి దేశానికి ప్రతిష్ట తెచ్చిన రెజ్లర్ పహిల్వాన్లపై లైంగిక దాడులకు పాల్పడడం దారుణమన్నారు. భూషణ్‌సింగ్‌పై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని తొమ్మిది రోజులుగా ధర్నా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బి ఆంజనేయులు మాట్లాడుతూ బీజేపీ దుర్మార్గ పరిపాలన సాగుతోందని తక్షణమే ప్రభుత్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్, జె.సత్యనారాయణ, ప్రమోద్, వినోద్, పి.మోహిని, బి.గణేష్, యం.శివ, సీహెచ్ శాంతి, ఐ.షరానో, పల్లవి, జాను, అర్జున్, దినేష్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా సాగింది. కాళ్లకూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీస్వామివారి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి శ్రీస్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వగా గాజువాకకు చెందిన కాండూరి వెంకట రమణాచార్యుల వేదమంత్రాలు నడుమ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు, స్రవంతి దంపతులతో కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేసింది. కార్యక్రమంలో ముందుగా డీసీసీబీ చైర్మన్ పీవీ ఎల్ నరసింహరాజు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చిత్ర కళా పోటీల్లో సత్తాచాటిన హైస్కూలు విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం ప్రసాద్, చిత్రకళా ఉపాధ్యాయుడు వెంపటాపు తదితరులు

తణుకు అర్బన్: బాలల చిత్రకళా పోటీల్లో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల విజయవాడ డ్రీమ్ యూత్ అండ్‌చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన వివిధ అంశాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చూపించి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేఎస్‌వీవీ ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా ఆల్ ఇండియా బాల చిత్ర కళా అవార్డును పాఠశాల ఆరో తరగతి విద్యార్థి ఎస్.కుశల్ ఈశ్వర్ కుమార్ సాధించగా 15 మందికి బంగారు, 10 మందికి వెండి పతకాలు గెలుచుకున్నట్లు వివరించారు. విశేష ప్రతిభ కనబరచిన విద్యార్థులతోపాటు విద్యార్థులను తీర్చిదిద్దిన చిత్రకళా ఉపాధ్యాయుడు వెంపటాపును ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రాంబాబు మృతి తీరని లోటు



కొల్లూరు రాంబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కొల్లూరు రాంబాబు అకాల మృతి యూనియన్‌కు తీరని లోటు అని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తాపీ మేస్త్రి, ప్రస్తుత యూనియన్ గౌరవాధ్యక్షుడు కొల్లూరు రాంబాబు సంతాప సభ మంగళవారం సిపాయిపేటలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగింది. తొలుత రాంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ మాట్లాడుతూ నిబద్ధతతో ఎన్నో సేవలు అందించిన కొల్లూరు రాంబాబు చిరస్మరణీయులు అన్నారు. ఆకస్మిక మరణం వారి కుటుంబానికే కాక యూనియన్‌కు తీరనిలోటు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాలూరి లక్ష్మణరావు, అంకం భాస్కరరావు, మెండేం జేమ్స్, పోలిరాతి ఆదినారాయణ, దువ్వా శ్రీనివాస్, అడపా సుబ్బారావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొనండి



సమావేశంలో మాట్లాడుతున్న పాతూరు రామాలయం నిర్మాణ కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరులో పునఃనిర్మాణ నూతన రామాలయం విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భక్తులు పాల్గొని తరించాలని నూతన రామాలయం ధర్మకర్త కర్రి సీతారామయ్య, నిర్మాణ కమిటీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ, దేవాదాయ శాఖ సీజీఎఫ్ సభ్యులు కర్రి భాస్కరరావులు పేర్కొన్నారు. కర్రి సీతారామయ్య నివాసం వద్ద మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆలయ కట్టడాన్ని తొలగించడం జరిగిందన్నారు. తమ కుటుంబీకులు సహాయ సహకారాలతో నూతన ఆలయాన్ని పునః నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కొవ్వూరు గాయత్రి పీఠం తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రి, అర్చకులు కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

భూములపై నాణ్యమైన రీ సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం : రీ సర్వేలో అందరూ భాగస్వాములై టీం వర్క్ చేస్తే నాణ్యమైన రీ సర్వే జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం రాత్రి ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులకు రీ సర్వేపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఒక కచ్చితమైన రికార్డు తయారుచేయబడుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనల ప్రకారం ప్రణాళిక బద్ధంగా రీ సర్వే చేయాలని అన్నారు. ప్రజలను భాగస్వాములను చేసి నాణ్యమైన రీ సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ రీ సర్వే మిరర్ ఇమేజ్, గ్రౌండ్ రియాలిటీ ప్రకారం జరగాలని, ప్రభుత్వ భూములకు గతంలో ఉన్న సరిహద్దులను మాత్రమే తీసుకోవాలని సూచించారు. పట్టా భూమి ఎవరైతే ఎంజాయ్ మెంట్‌లో ఉన్నారో సరిచేసుకోవాలి అన్నారు. పేషియల్ డేటాకు టెక్స్ట్ డేటాకు తేడా రాకూడదని, గ్రామ సరిహద్దులు సరిచేసుకోవాలన్నారు. రీ సర్వే కచ్చితంగా చేసే సులువైన పద్ధతులను పవర్ పాయింట్ ద్వారా జాయింట్ కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.కృష్ణవేణి, భీమవరం ఆర్‌డీఓ దాసి రాజు, సర్వే లాండ్ రికార్డ్స్ ఏడీ జాషువా, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, వీఆర్వోలు, విలేజ్ సెక్రటరీలు, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.